క్లుప్తంగా

24న చెరువు లీజు వేలం

పెంట్యాలవారిగూడెం(వత్సవాయి): గ్రామంలోని రెడ్డి చెరువు లీజు వేలంపాటను ఈనెల 24వతేదీ ఉదయం పదిగంటలకు పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించనున్నట్లు సర్పంచి వడ్డే పరమయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా లక్ష రూపాయలు డిపాజిట్ చెల్లించాలన్నారు. మూడేళ్ల లీజుకు సంబంధించి హెచ్చు పాటదారుగా నిలిచినవారు తొలిఏడాదికి సంబంధించిన నగదును వెంటనే చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆసక్తిగలవారు చెరువు లీజు వేలంలో పాల్గొనాలని ఆయన కోరారు.

రెండోవిడత పాఠ్యపుస్తకాలు సరఫరా

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు రెండోవిడత సెమిస్టర్–2కి సంబంధించిన పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసినట్లు ఎంఈవో చిట్టిబాబు శనివారం తెలిపారు. ఒకటి నుంచి పదోతరగతికి సంబంధించిన రెండో విడత పాఠ్యపుస్తకాలను అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పంపిణీ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు కృష్ణయ్య, శివరాం, సుబ్రహ్మణ్యం, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలోని జంగాల కాలనీలో నివసిస్తున్న పేదలకు శనివారం జగ్గయ్యపేటకు చెందిన ఓరుగంటి వెంకటేశ్వర్లు దుప్పట్లు, చాపలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణపై అవగాహన



ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): పోషక మాసోత్సవాల సందర్భంగా శనివారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల్లో వెయ్యి రోజుల సంరక్షణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీసుకోవాల్సిన పోషకాహారంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారం వివరాలను తెలియజేసి, అందరూ పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక స్టాక్ పాయింట్ పరిశీలన



అనుమంచిపల్లి(జగ్గయ్యపేట): మండలంలోని అనుమంచిపల్లి ఇసుక స్టాక్ పాయింట్ వద్ద శనివారం ఇసుక విక్రయాలు ప్రారంభమయ్యాయి. 20 రోజులుగా ఇసుక స్టాకు పాయింట్ వద్ద ఇసుక విక్రయాలు నిలిపివేశారు. రెండు రోజులుగా సర్వర్‌లు పనిచేయకపోవటంతో నిలిచిన విక్రయాలు తిరిగి ప్రారంభమయ్యాయి. వార్డు, గ్రామ సచివాలయాల్లో ఇసుక కోసం బుక్‌చేసుకున్న లబ్ధిదారులు స్టాక్ పాయింట్‌కు వచ్చిన ఇసుకకు ఆయా వాహనాల్లో తరలించారు. పలువురు విజయవాడలో ఆన్‌లైన్ ద్వారా బుక్‌చేసుకుని వాహనాల ద్వారా ఇసుకను తీసుకువెళ్లారు. ఇసుక స్టాక్ పాయింట్‌ను తహసీల్దార్ నాగరాజు సందర్శించారు. ఇసుక విక్రయాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

హామీలు నెరవేర్చలేకే డైవర్షన్ రాజకీయాలు

మాజీఎమ్మెల్యే జగన్‌మోహనరావు



ముఖ్యనాయకులకు దిశానిర్దేశం చేస్తున్న మాజీఎమ్మెల్యే జగన్‌మోహనరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి పూనూరు గౌతంరెడ్డి

నందిగామ టౌన్: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలుచేయలేక...ప్రజలకు సమాధానం చెప్పలేక సీఎం చంద్రబాబు డైవర్షన్ రాజకీయాలకు తెరతీశారని నందిగామ మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో శనివారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన కృష్ణా, గుంటూరుజిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి పూనూరు గౌతంరెడ్డితో కలిసి తొలుత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదర్శవంత పాలన అందించారని గుర్తుచేశారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా జగన్‌మోహన్‌రెడ్డి సాహసోపేత నిర్ణయాలు తీసుకుని పార్టీలు, కులమతాలకు అతీతంగా అందరికీ మేలు చేశారని గుర్తుచేశారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలు ఇచ్చారని అధికారంలోకి వచ్చి మూడునెలలు దాటినా సూపర్‌సిక్స్‌లోని ఒక్క హామీని అమలుచేయలేకపోయారని విమర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ విజయానికి చేయాల్సిన కృషిపై ముఖ్యనాయకులకు దిశానిర్దేశం చేశారు.

ఓట్ల నమోదుపై దృష్టి పెట్టాలి: గౌతంరెడ్డి

అనంతరం కృష్ణ, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి పూనూరు గౌతంరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల నమోదులో పార్టీ ముఖ్యనాయకులు క్రియాశీలక పాత్ర పోషించాలని సూచించారు. ఈఎన్నికల్లో పార్టీ విజయానికి నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ, మండల కన్వీనర్‌లు దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, మంచాల చంద్రశేఖర్, మంగునూరు కొండారెడ్డి, ఎంపీపీ ఆకుల హనుమంతరావు, నాయకులు కోటేరు ముత్తారెడ్డి, రామిరెడ్డి సీతయ్య, చింతా రవీంద్రనాథ్, నాయుడు ఉదయలక్ష్మి, సూరె రామారావు, చింతోటి ప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతం



గర్భిణులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే తాతయ్య, సీడీపీవో లక్ష్మీభార్గవి, నాగమణి తదితరులు
కేతవీరునిపాడులో...

జగ్గయ్యపేట అర్బన్: గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని, తద్వారా రక్తహీనత వంటి వ్యాధులు రాకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) సూచించారు. పోషణ అభియాన్, పోషణ మాసోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక నకాశిబజారులో శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద చిల్లకల్లు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ వారి ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే తాతయ్య గర్భిణులను ఆశీర్వదించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గర్భిణులు తగిన పోషకాహారం తీసుకోవాలని సూచించారు. సీడీపీవో లక్ష్మీ భార్గవి మాట్లాడుతూ అంగన్‌వాడీలలో అందజేసే పోషకాహారాన్ని క్రమంతప్పకుండా తీసుకోవాలని కోరారు. వేయి రోజుల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఏసీడీపీవో నాగమణి మాట్లాడుతూ చిరు ధాన్యాల ఉపయోగాలను వివరించారు. కౌన్సిలర్లు పాకలపాటి సుందరమ్మ, కర్ల శాంతకుమారి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు శారద, బీబీ జాన్, సువర్ణ, ఏఎన్ఎం ఝాన్సీ, మహిళా సంరక్షణ కార్యదర్శి నిర్మల, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

నందిగామ టౌన్: మండలంలోని కేతవీరునిపాడు అంగనవాడీ కేంద్రంలో శనివారం పోషణా మాసోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకట్రావమ్మ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. పోషకాహార ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు అంగనవాడీ కార్యకర్తలు, బాలింతలు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ



నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్యే తాతయ్య, రామ్‌కో సిమెంట్స్ ప్రతినిధులు

జగ్గయ్యపేట అర్బన్: వరద బాధితులకు స్వచ్ఛంద సంస్థలు, పరిశ్రమల యాజమాన్యం తమవంతు సహాయసహకారాలు అందించడం అభినందనీయమని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అన్నారు. పట్టణంలోని మిట్టగూడెం కర్లబజారులోని వరద బాధితులకు రామ్‌కో సిమెంట్స్‌వారు అందజేసిన నిత్యావసర సరుకులను ఎమ్మెల్యే శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ నూకల కుమార్ రాజా, శ్రీరాం చినబాబు, రామ్‌కో సిమెంట్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కరపత్రాల పంపిణీ..

ముక్త్యాల(జగ్గయ్యపేట): ముక్త్యాలలో శనివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు, టీడీపీ నాయకులు గ్రామంలో ఇంటింటికీ తిరిగి 100 రోజుల కూటమి పాలనలో చేసిన పనులను వివరిస్తూ గ్రామస్తులకు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్‌బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు కట్టా వెంకట నరసింహారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సుపరిపాలన దిశగా అడుగులు : ఎమ్మెల్యే



చెన్నారావుపాలెం(వీరులపాడు): ప్రజలకు సుపరిపాలన అందించేలా టీడీపీ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. మండలంలోని చెన్నారావు పాలెం గ్రామంలో శనివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సౌమ్య మాట్లాడుతూ టీడీపీ కూటమి 100రోజుల పాలనలో ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు వివరించేందుకే ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. అనంతరం గ్రామసమీపంలోని ఏనుగుగడ్డ వాగును పరిశీలించి అధికారులతో మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటితో నిమజ్జనాలు ముగించాలి: ఏసీపీ



మాట్లాడుతున్న ఏసీపీ డాక్టర్ రవికిరణ్, పక్కన ఎస్ఐలు

జగ్గయ్యపేట అర్బన్: నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పట్టణంలో వివిధ కూడళ్లలో ఏర్పాటుచేసిన మండపాల్లోని వినాయకుల నిమజ్జన కార్యక్రమాలను నిర్వాహకులు ఆదివారంతో ముగించాలని నందిగామ ఏసీపీ డాక్టర్ బి.రవికిరణ్ సూచించారు. స్థానిక సీఐ కార్యాలయంలో వినాయకుని మండపాల నిర్వాహక కమిటీలతో శనివారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఏసీపీ మాట్లాడుతూ వినాయకుని నిమజ్జనాల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పట్టణంలోని ప్రధాన సెంటర్లలోని సీసీ కెమెరా పాయింట్లను పరిశీలించారు. ఆయన వెంట పట్టణ ఎస్ఐ వెంకటేశ్వరరావు, వత్సవాయి ఎస్ఐ ఉమామహేశ్వరరావు ఉన్నారు.

23 మందికి జరిమానా

విజయవాడస్పోర్ట్స్: మద్యం తాగి వాహనాలు నడిపిన 23 మందికి విజయవాడ 6వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి లెనిన్ బాబు శనివారం జరిమానా విధించారు. ఐదో ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 23 మంది పట్టుబడ్డారు. వీరిని అదుపులోకి తీసుకున్న వెంటనే న్యాయమూర్తి వద్ద హాజరుపర్చారు. వీరిలో ఏడుగురికి రూ. 15 వేల చొప్పున, 16 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు.

టీడీపీ, జనసేన మధ్య స్వల్ప వివాదం



వివాదానికి కారణమైన ఫ్లెక్సీ ఇదే..



ఫ్లెక్సీపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్న టీడీపీ కౌన్సిలర్ గీతారాణి

జగ్గయ్యపేట: పట్టణంలో టీడీపీ, జనసేన పార్టీల మధ్య ఫ్లెక్సీల విషయంలో స్వల్పవివాదం శనివారం స్వల్ప వివాదం చోటుచేసుకుంది.

వివరాలలోకి వెళితే ఇటీవల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ఆపార్టీకి రాజీనామా చేసి జనసేన పార్టీలోకి వెళ్తున్న నేపథ్యంలో స్థానిక పాత మున్సిపల్ సెంటర్‌లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో 29వవార్డు టీడీపీ కౌన్సిలర్ గీతారాణితోపాటు మరికొందరు టీడీపీ కార్యకర్తలు అక్కడకు వచ్చి ఉదయభాను ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలపై స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) ఫోటో లేదని అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో విషయం తెలుసుకున్న జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా అక్కడకు చేరుకున్నారు. ఈ మేరకు సమాచారం అందడంతో పోలీసులు వచ్చి ఇరువర్గాలతో మాట్లాడారు. మున్సిపల్ కమిషనర్ రామ్మోహన్ ఇరువర్గాల ఫ్లెక్సీలు తీయాలని ఉపక్రమించడంతో ఇరువర్గాలు అక్కడి నుంచి వెనుదిరిగాయి. దీంతో వివాదం సద్దుమణిగింది. ఉదయభాను జనసేనలో చేరకముందే జనసేన, టీడీపీ వర్గాలు బాహాబాహీకి దిగుతుండటంతో రానున్న రోజుల్లో పరిస్థితులు ఎలా ఉంటాయోనని రాజకీయవర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది.

డొంకరోడ్లకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్



గొట్టుముక్కల కట్టిలవాగు, ఏనుగుగడ్డ వాగుకు చేపట్టిన తాత్కాలిక మరమ్మతులు

కంచికచర్ల : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని కట్టిల వాగు, ఏనుగుగడ్డ వాగు, కొట్టుకుపోయింది. కొండపల్లి రిజర్వు ఫారెస్ట్‌లో కొలువై ఉన్న మద్దులమ్మ అమ్మవారి ఆలయానికి వెళ్లే డొంక రోడ్డు కూడా వర్షానికి దెబ్బతింది. వరద ఉధృతికి డొంకరోడ్లు ధ్వంసం కావటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పొలాలకు నడిచి వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో కూలీలు కూడా రావటం లేదని రైతులు వాపోతున్న వైనం ఈనెల 17వతేదీన 'సాక్షి' ఓ కథనాన్ని ప్రచురించింది. దీంతో స్పందించిన కంచికచర్ల ఉపసర్పంచి గోగినేని అమరనాథ్ ప్రొక్లెయిన్ సాయంతో డొంకరోడ్ల మరమ్మతులు చ చేపట్టారు. రైతులు పొలాల్లోకి వెళ్లేందుకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు డొంకరోడ్ల అభివృద్ధి పనులు చేపట్టిన ఉపసర్పంచి అమర్‌నాథ్‌క రైతులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.



పెనుగంచిప్రోలు మసీదుసెంటర్ గణనాథుడి ఊరేగింపు



ఎస్సీకాలనీలో ఏర్పాటు చేసిన గణనాథుని ఊరేగింపు



పోలీస్‌స్టేషన్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడు

కొనసాగుతున్న వినాయక నిమజ్జనాలు

చవితి పందిళ్లలో పూజలు అందుకున్న గణనాథుని నిమజ్జన కార్యక్రమాలు ఘనంగా జరుగుతున్నాయి.పెనుగంచిప్రోలులోని ఆయా కూడళ్లలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాలను శనివారం ఘనంగా ఊరేగించి స్థానిక మునేరు, కాల్వల్లో నిమజ్జనం చేశారు. తీన్‌మార్ డ్యాన్స్‌లు, బాణసంచా మెరుపులతో వినాయకుడి ఊరేగింపు కార్యక్రమాలు ఆద్యంతం సందడిగా సాగాయి. –పెనుగంచిప్రోలు

వచ్చే నెలలో మెగా ఫుడ్ బిజినెస్ ఎక్స్‌పో



గుణదల(విజయవాడతూర్పు): వచ్చే నెల 4, 5, 6 తేదీల్లో నగరంలోని ఎస్ఎస్ కన్వెన్షన్‌లో మెగా ఫుడ్ బిజినెస్ ఎక్స్‌పో – 2024 నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్‌వీ స్వామి తెలిపారు. గుణదలలోని హోటల్ హయాత్‌లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ ఈ మెగా ఫుడ్ బిజినెస్ ఎక్స్‌పోను ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అసోసియేషన్, కేటరర్స్ అసోసియేషన్, ఏపీ ఫెడరేషన్ ఆఫ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్, విజయవాడ హోటల్స్ అసోసియేషన్, విజయవాడ చాంబర్స్ ఆఫ్ కామర్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఎక్స్‌పోలో రెస్టారెంట్స్ పెట్టాలి అనుకునేవారికి కమర్షియల్ కిచెన్ ఎక్విప్‌మెంట్, హౌస్ పర్పస్ కోసం హోమ్ అప్లయన్సెస్, ప్యాకింగ్ అండ్ సీలింగ్ మిషనరీ, మసాల్స్, పికిల్స్, ఫ్రోజన్ ఫుడ్స్ వంటి 120 స్టాల్స్ వరకు కొలువుతీరతాయని వెల్లడించారు. అలాగే బిజినెస్ ఉన్న వారు ఇక్కడ స్టాల్స్ పెట్టుకుని వారి వ్యాపారాన్ని ప్రమోట్ చేసుకునే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఏపీ కేటరర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వరదరాజులు, ఏపీ ఫెడరేషన్ ఆఫ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ వక్కలగడ్డ భాస్కరరావు, విజయవాడ హోటల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రమణ, గెడ్డం రవి, రాఘవ, ఎం. వెంకటేశ్వరరావు, కె.వెంటేశ్వరరావు, చుండూరు ఉమామహేశ్వరరావు, రేణుకా శ్రీదేవి పాల్గొన్నారు.

పత్తికి తెల్లదోమ ముప్పు



వత్సవాయి మండలం మంగొల్లులో పూత, పిందెదశలో ఉన్న పత్తిపంట

వత్సవాయి: తెల్లబంగారంగా పేరుగాంచిన పత్తిసాగు చేపట్టి సుమారు 80రోజులు కావస్తోంది. ఈ ఖరీఫ్‌లో సీజన్‌లో మండలంలో పత్తి పంటను గతంలో కంటే ఎక్కువ విస్తీర్ణంలో సాగుచేశారు. ప్రస్తుతం పత్తి పంట పూతదశలో ఉంది. రైతులు ఈదశలో ఉన్న పంటను జాగ్రత్తగా కాపాడుకోవాలని, లేనిపక్షంలో తెల్లదోమ, గులాబీరంగు పురుగు బారినపడి పంటను నష్టపోయే ప్రమాదం ఉంది. నాలుగైదు ఏళ్లుగా ఎక్కువమంది రైతులు తెల్లదోమ, గులాబీరంగు పురుగుతో నష్టపోయారు. పంట చేతికివచ్చే సమయంలో వచ్చే వీటి విషయంలో అజాగ్రత్తగా ఉంటే అసలుకే మోసం వస్తుంది. అత్యంత ప్రమాదంగా మారి పంటను పూర్తిగా నాశనం చేసే తెల్లదోమను అరికట్టే విధానంపై రైతులకు వత్సవాయి వ్యవసాయాధికారి వి.రవికుమార్ పలు సూచనలు చేస్తున్నారు.

తెల్లదోమను గుర్తించే విధానం...

తెల్లదోమ ఇది ఆకుల కిందభాగంలో గుంపులుగుంపులుగా ఉంటాయి. ఈ దోమ సీజన్‌తో సంబంధం లేకుండా సంవత్సరం పొడువునా కనిపిస్తుంది. పిల్లదోమ పాలిపోయిన పసుపురంగులో ఉండగా, పెద్ద దోమ పూర్తి పసుపురంగులో ఉండి రెక్కలు పొడవుగా ఉంటాయి. ఈ దోమలు అడుగుభాగంలో ఉండి గుడ్లను పెడతాయి. ముఖ్యంగా చలికాలంలో వీటి వృద్ధి ఎక్కువగా ఉంటుంది. ఏడాదికి 12 నుంచి 15సార్లు జన్మిస్తాయి. ఈ దోమలు ఆకులకు రంధ్రాలు చేస్తూ వాటిలో రసాన్ని మొత్తం తాగేస్తుండటంతో మొక్కల్లో ఎదుగుదల లోపిస్తుంది. దీంతో అప్పటివరకు ఉన్న కాయల్లో తయారవుతున్న పత్తి కూడా విచ్చుకోకుండా లోపలే నల్లగా మారిపోతుంది. తెల్లదోమ ధాటికి కొన్నిసార్లు పత్తి మొక్క ఆకులన్నీ పాలిపోవడంతోపాటు బిరుసెక్కి మొక్కనుంచి రాలిపోతాయి.

గులాబీరంగు పురుగు...

గులాబీరంగు పురుగు పంటకాలం 100 రోజుల నుంచి మొదలై 120, 140 రోజుల్లో ఎక్కువగా కనిపిస్తుంది. దీర్ఘకాలికంగా ఒకేరకం హైబ్రిడ్ విత్తనం సాగుచేయడం పత్తితీతలు ఆలస్యం కావడంతో ఈ పురుగు ఎక్కువయ్యేందుకు ప్రధానకారణాలు. పురుగు లార్వాదశ మొత్తం కాయలోనే ఉండటం ద్వారా పత్తి కాయ పగిలిన తర్వాతే పురుగు ఉధృతి కనిపిస్తుంది. మూడు నుంచి ఆరువారాల్లో మొత్తం దశను గులాబీరంగు పూర్తిచేస్తుంది.

నివారణచర్యలు..

- తెల్లదోమ ఎక్కువగా ఉంటే పసుపురంగు అట్టాలకు జిగురుపూసి పొలంలో అక్కడక్కడా పెట్టాలి. దీంతో తెల్లదోమ అట్టలకు ఆకర్షించబడి జిగురుకు అతుక్కుపోతుంది.
- కీటకాలను ఎక్కువగా ఆకర్షించే టమాటా, ఆముదం మొక్కలను పొలంలో అక్కడక్కాడా వేసుకుంటే మంచిది. పత్తి పంట కంటే ముందుగా వీటిపైనే దోమ వాలుతుంది. వాటిని గమనించుకుంటూ మందులు పిచికారీ చేసుకోవచ్చు.
- పత్తిలో అంతరపంటలుగా కంది, అలసంద, మినుము, కొర్రలు వంటివి సాగుచేసుకుంటే మిత్రపురుగులు పెరగడంతో రసం పీల్చే పురుగుల వృద్ధి తగ్గుతుంది.
- దోమ బారి నుంచి తప్పించుకోవడానికి వేపగింజల కషాయం, వేపనూనెను నీళ్ళలో కలిపి ఆకులు కిందభాగం మొత్తం తడిసేలా పిచికారీచేసుకుంటే మంచిది.
- తెల్లదోమ నివారణ నిమిత్తం రైతులు విచ్చలవిడిగా పురుగుమందులు పిచికారీ చేసినా, పెట్టుబడులు పెరగడం తప్ప ఎటువంటి ఉపయోగం ఉండదు.

తెల్లదోమపై అవగాహన ఉండాలి..

పత్తి పంటను నాశనం చేసే తెల్లదోమను గుర్తించడంలో రైతుకు అవగాహన కలిగి ఉండాలి. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో పొలానికి వెళితే బాగా కనపడుతుంది. ఆకు కిందభాగంలో చేరి రసాన్ని మొత్తం పీల్చేస్తుంది. దీంతో ఆకులు పాలిపోయి రాలిపోతాయి. పొలంలో పసుపురంగు అట్టలకు జిగురుపూసి పెడితే ఆకర్షణకు గురై వాటికి అతుక్కుంటాయి. వేపనూనె, గింజల కషాయాన్ని పిచికారీ చేసినట్లయితే దోమ బారి నుంచి పంటను రక్షించుకోవచ్చు.

రవికుమార్, వత్సవాయి ఏవో

యువకుడు ఆత్మహత్య

కంచికచర్ల : మద్యానికి బానిసైన ఓ యువకుడు మద్యంలో పురుగుమందు కలుపుకుని తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కంచికచర్ల మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఇబ్రహీంపట్నం మండలం దాములూరు గ్రామానికి చెందిన ఉప్పులూరి ఏసయ్య(30) అనే వ్యక్తి జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసై రోజు తప్పతాగి ఇంటికి వస్తుండటంతో కుటుంబసభ్యులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన అతను శుక్రవారం పరిటాల వచ్చి మద్యంలో పురుగుమందు కలుపుకుని తాగుతూ వీడియో కాల్‌లో మాట్లాడాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు సంఘటనాస్థలానికి చేరుకుని ఓ ప్రైవేట్ వాహనం ద్వారా అతన్ని విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా చికిత్సపొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు న్నారు.